

కారంపూడి, ముప్పాళ్ల ఎంపీపీలపై అవిశ్వాసం?

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల పాలక వర్గాలు ఏర్పడి నాలు గేళ్లు పూర్తవ్వడంతో అవిశ్వాసంపై చర్చ జరుగుతోంది. కారంపూడి, ముప్పాళ్ల ఎంపీపీలపై అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేరకు జడ్పీ అధికారులకు సమాచారం అందింది. అప్పట్లోనే ఆయా మండలాలకు చెందిన ఎంపీటీసీ లు ఆర్డీవోను కలిసి అవిశ్వాసం నోటీసులు అందజేసినట్లు సమాచారం. అయితే అప్పటికీ ఇంకా నాలుగేళ్లు పూర్తి కానందున ఆ ప్రతిపాదన చెల్లుబాటు కాదని జడ్పీ అధి కారులు తేల్చారు. ప్రస్తుతం గడువు ముగియడంతో కారంపూడి, ముప్పాళ్ల ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలకు రంగం సిద్ధమవుతోంది. గురజాల నియోజకవర్గంలోని మరో మండలంలో కూడా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతోంది.



సమావేశంలో కలెక్టర్ కృతికాశుక్లా

బాల్య వివాహాలను అరికట్టాలి

- మహిళా శిశు సంక్షేమశాఖ మెరుగుపడాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికాశుక్లా

నరసరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి వాటిని అరికట్టాలని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమ శాఖ పనితీరు మెరుగు పరుచుకోవాలని ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రోజు వారి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. పోషణ లోపానికి గురైన పిల్లల్ని గుర్తించి వారికి సరైన పోషకాహారం అందించాలన్నారు. ప్రీ స్కూళ్లలో హాజరు పెంచాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. సమా వేశంలో శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు ఉమాదేవి, శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీస్తు జయంతి ముగింపు వేడుకలు

- రెంటచింతల ఆర్‌సీఎం చర్చిలో భారీగా సన్నాహాలు

రెంటచింతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకల ముగింపును ఆదివారం రెంటచింతల ఆర్‌సీఎం చర్చిలో భారీఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్యతో పాటు పల్నాడులోని 16 పారిస్‌ల నుంచి విచారణ గురువులు, కన్యస్త్రీలు ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. బిషప్ భాగ్యయ్య నేతృత్వంలో దివ్యబలిపూజ, దివ్య ప్రసాద స్తుతి ఆరాధన, దైవవాక్య బోధన తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. సుమారు 4 వేల మందికి అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.శుక్రవారం రాత్రి ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫాదర్లు ఎలీషారాజ్, గోవిందు బాలస్వామి, రత్నకుమార్, సహాయ విచారణ గురువులు ప్రసన్నకుమార్, మరియదళ సభ్యులు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు.


ఆర్‌సీఎం చర్చి




ఖరీఫ్..కళకళ

3 జిల్లాల్లో.. 9.56 లక్షల ఎకరాలు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 9.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. పల్నాడు జిల్లాలో లక్ష్యాలను మించి రైతులు పంటలు సాగు చేశారు. పల్నాడులో సాగు విస్తీర్ణం 117 శాతంగా నమో దైంది. వ్యవసాయ ఉత్పత్తులపైనే జిల్లా జీడీపీ ఆధారపడి ఉంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడం తో జిల్లాల వృద్ధి రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని అంచనా.

విస్తారంగా.. వరి

ఈ ఏడాది సాగు నీరు గతంలో కంటే ముందస్తుగానే సరఫరా చేశారు. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వరి సాగు విస్తృతంగా జరిగింది. గత నాలుగేళ్ల కంటే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరిగింది. మూడు జిల్లాల్లో 5,53,475 ఎకరాల్లో వరి సాగు చేశారు. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కంటే వరి 46 శాతం పెరిగిందని వ్యవసాయ శాఖ పేర్కొంది. బాపట్ల జిల్లాలో నాలుగు, గుంటూరు జిల్లాలో ఒక శాతం పెరిగింది.


పత్తి

- అంచనాలకు మించి సాగు
- 9.56 లక్షల ఎకరాల్లో పంటలు
- పెరిగిన వరి, పత్తి, కంది విస్తీర్ణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆశాజనకంగా వర్షాలు.. జలకళతో జలాశయాలు, చెరువులు.. రైతుల్లో ఉత్సాహంతో ఖరీఫ్ సాగు కళకళలాడుతోంది. అంచనాలకు మించి రైతులు పంటల సాగును విస్తృతంగా చేపట్టారు. రికార్డు స్థాయిలో వరి, పత్తి, కంది పంటల సాగవుతున్నాయి. సాగు ఆరంభంలో వర్షాభావం నెలకొన్నా తదుపరి భారీగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ఉత్సాహంగా పంటల సాగు చేపట్టారు.

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో పంటల సాగు లక్ష్యం 4.53 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే సాగు సాధారణ విస్తీర్ణం 3,89,017 ఎకరాలు కాగా 4,56,563 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. లక్ష్యాలను మించి రైతులు పంటలు సాగు చేశారు. వరి సాగు సాధారణ విస్తీర్ణం 96,497 ఎకరాలు కాగా 1,40,643 ఎకరాల్లో సాగు జరిగింది. వరి సాగు 146 శాతంగా నమోదైంది. కంది సాధారణ విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా 77,333 ఎకరాల్లో సాగైంది. దాదాపు సాధారణం కన్నా 24,698 ఎకరాల్లో కంది సాగు పెరగడం గమనార్హం. కంది సాగు 147 శాతంగా నమోదైంది. పొగాకు సాగును నిషేధించడం వల్ల కంది సాగు పెరిగిందని అంచనా. పత్తి సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా 2,27,180 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది కంటే 62,615 ఎకరాల్లో పత్తి సాగు పెరిగింది. పత్తి సాగు 99 శాతంగా నమోదైంది. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పత్తి పంట ఊసురు తీస్తున్నాయి. వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకున్నాయి.


కంది

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో పంటల సాగు లక్ష్యం 2,25,525 ఎకరాలు. సాధారణ విస్తీర్ణం 2,21,343 ఎకరాలు కాగా 2,20,930 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. నూరు శాతం పంటలు సాగైనట్లు వ్యవ సాయ శాఖ వెల్లడించింది. వరి, పత్తి పంటలు ప్రధానంగా సాగయ్యాయి. వరి సాధారణ విస్తీర్ణం 1,53,143 ఎకరాలకు కాగా 1,55,005 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా 59,835 ఎకరాల్లో సాగు చేశారు. మినుము 3,767 ఎకరాల్లో, పొగాకు 1,170 ఎకరాల్లో సాగు చేశారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 2 ప్రాజెక్టులు

- విద్యార్థులను అభినందించిన డీఈవో చంద్రకళ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ శుక్రవారంతో ముగిసింది. వివిధ పాఠశాలల నుంచి 31 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. వీటిలోంచి అత్యుత్తమంగా ఉన్న రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. మొదటి స్థానం మండలంలోని కాకాని ఉన్నత పాఠశాలకు చెందిన వక్కలగడ్డ కాత్యాయని, రెండో స్థానం పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కోడిరెక్క ఇమ్మానియేల్ పొందారు. వీరు ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులను డీఈవో ఎల్.చంద్రకళ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు షేక్ సుభాని, వి.ఏసుబాబు, హెచ్‌ఎం పార్వతి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్, పూర్వ సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్, రఘురాం, చింతా శ్రీనివాసరెడ్డి, శివప్రియ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపికైన విద్యార్థులతో డీఈవో ఎల్.చంద్రకళ

నేడు సాగర్ సందర్శనకు రాష్ట్ర గవర్నర్

మాచర్ల రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్‌ను శని, ఆదివారాల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సందర్శించనున్నట్లు తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం నాగార్జున సాగర్ చేరుకుని.. హిల్ కాలనీలోని విజయ విహార్‌లో గవర్నర్ బస చేస్తారు. 19న లాంచీలో నాగార్జున కొండలోని బౌద్ధ స్థూపాలను, విజయపురిసౌత్ లాంచీ స్టేషన్, అనుపు, ఎత్తిపోతల జలపాతాలను సందర్శిస్తారు.

రూ.1.32 కోట్ల.. బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపివేత



గుంటూరులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహన్ రావు బృందం

గుంటూరు సిటీ, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వ్యవసాయ శాఖ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో సరైన పత్రాలు చూపించలేదన్న కారణంతో రూ.1.32 కోట్ల బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపి వేతకు ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఏడీఏలు నాగభైరు మోహన్ రావు, తోట శ్రీనివాసరావు, వి.కోటేశ్వరి, ఆర్.విజయబాబు, సీహెచ్ తిరుమల దేవి, ఐ.సునీత, ఏఓలు సునీల్, గౌతమ్ ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, బుల్ల కిషోర్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

'మెలియాయిడోసిస్'కు మెరుగైన వైద్య సేవలు

● రెండు నెలల చికిత్సతో కోలుకున్న తురకపాలెం వాసి

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి



కోలుకున్న ఎలీషాతో డాక్టర్ రమణ యశస్వి, వైద్య బృందం

గుంటూరు మెడికల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెలియాయిడోసిస్ జ్వర బాధితులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తురకపాలేనికి చెందిన పసుమర్తి ఎలీషా (46) మెలియాయిడోసిస్ బారిన పడి జీజీహెచ్‌లో చికిత్సల ద్వారా ఆరోగ్యపరంగా కోలుకున్నాడు. శుక్రవారం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసిన సందర్భంగా సూపరింటెండెంట్ చాంబరులో డాక్టర్ రమణ యశస్వి విలేకర్లతో మాట్లాడారు. ఎలీషా మెలియాయిడోస్ బారిన పడి ఆగస్టు 21న చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరినట్లు తెలిపారు. అతడి ఎడమ మోకాలిలోని సైనోవియల్ ఫ్లూయిడ్‌ను సేకరించి పరీక్షించి మెలియాయిడోసిస్‌కు కారణమైన బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియాను గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఆరు వారాల పాటు ఎలీషాకు ఐవీ ద్వారా మీరాపెనం యాంటీబయోటిక్ మందు ఇవ్వడంతో అతడు కోలుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిశ్చార్జి చేస్తున్నా, మరో ఆరు వారాలు అతడు ఓరల్ యాంటీ బయోటిక్ మందులు తీసుకోవాల్సి ఉందన్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన మరొక రోగికి కూడా మెలియాయిడోసిస్ పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ వెల్లడించారు. ఈ వ్యాధి బారిన పడే వారిలో 80 శాతం మంది షుగర్ బాధితులే ఉంటున్నారని ఆయన తెలిపారు. దీర్ఘకాలంగా జ్వరాలతో బాధపడే తురకపాలెం వాసులు, షుగర్ రోగులు ఆలస్యం చేయకుండా చికిత్సలు పొందాలని ఆయన కోరారు. ఎలీషాకు చికిత్స అందించిన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సి.వాసంతి, డాక్టర్ బబిత, డాక్టర్ జి.ప్రభాకర్, పీజీలు ఆశాజ్యోతి, వి.స్వర్ణను, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ అనిల్‌ను డాక్టర్ రమణ అభినందించారు.

విలువల ఆధారంగా..

నాయకత్వం పెంపొందించుకోవాలి

● ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య సుధాకర్ రెడ్డి

గుంటూరు (విద్య) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది కేవలం జ్ఞాన సంపాదనకే పరిమితం కాకుండా, విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత వ్యాపారంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే వారికి మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఆధునిక మేనేజ్‌మెంట్ విద్యలో భారతీయ విలువలు, సాంప్రదాయ జ్ఞానం, నైతిక దృక్పథం, సుస్థిరతలను సమన్వయ పరచాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ, పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్ ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు, ఐబీటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. పి. గణేష్ , విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,302, ఎడమ కాలువ ద్వారా 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, మొత్తం ఔట్‌ఫ్లో 53,131 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 36,531 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను 1.50 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ చానల్ ద్వారా 8,555 మొత్తంగా 29813 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32,480 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా.. ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,375 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 39,221 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,138, పశ్చిమ డెల్టాకు 5,527, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఏఐతోనే భవిష్యత్తు ఉద్యోగాలు

● ఆచార్య సుబ్రహ్మణ్యం



ఆచార్య సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రతి రంగం కృత్రిమ మేధతో ముడిపడి ఉందని అమెరికాలోని సాన్ డియాగో ఎక్సలెన్స్ ప్రెసిడెంట్, సీఈవో ఆచార్య ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'సమాజ ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, కన్స్యూమర్, ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక పురోగతులు' అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సుకు ప్రధాన వక్తగా ఆయన విచ్చేశారు. భవిష్యత్ ఉద్యోగాలన్నీ.. ఏఐ సాంకేతికతను అర్థం చేసుకునే నైపుణ్యాలపై ఆధారపడతాయని సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు ఏఐ, డేటా సైన్స్, కంప్యూటింగ్ వంటి రంగాల్లో సాంకేతికతను పెంచుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరామ ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు. విద్య, పరిశోధన, సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు వర్సిటీ అందిస్తున్న సాంకేతిక అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక అతిథి ఐఎంఆర్ఎఫ్ చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, సహాయక ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీకృష్ణ, చంద్రమౌళి, ఉద్యోగ కల్పన సమన్వయకర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎం-యూటీఎస్ పరికరాల ఆవిష్కరణ



మిషన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మొబైల్ అన్ రిజర్వ్‌డ్ టిక్కెటింగ్ సిస్టమ్ పరికరాలను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీని వల్ల ప్రయాణికులు యూటీఎస్/ ప్లాట్‌ఫాం టిక్కెట్లు పొందడం చాలా సులభతరం అవుతుంది. ఎం-యూటీఎస్ సహాయక్‌లు రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి 500 మీటర్ల లోపల అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్‌లను ఈ పరికరం జారీ చేస్తారు. ప్రయాణికులు టిక్కెట్ చార్జీని నగదు/డిజిటల్ విధానంలో చెల్లించొచ్చు. దీని వల్ల రద్దీ సమయాల్లో క్యూలైన్ల బాధలు తప్పుతాయని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

యడ్లపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం కాపలాదారునిపై దౌర్జన్యం చేసిన ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడులోని ఓ మద్యం దుకాణంలో ఎగువ ఎస్సీ కాలనీకి చెందిన రత్నబాబు కాపలాదారుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి 12గంటల సమయంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి కాపలాదారుతో ఘర్షణ పడ్డారు. దీంతో రత్నబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు మద్యం దుకాణం వద్దకు వచ్చి అక్కడ పనిచేస్తున్న వారిని విచారించారు. ఆయన వెంట ఎస్ఐ శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



స్టేషన్‌లో ఎస్పీ కృష్ణారావు, ఇన్‌చార్జి డీఎస్పీ రామకృష్ణ

వినుకొండటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను పల్నాడు ఎస్పీ కృష్ణారావు మొదటి సారిగా శుక్రవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని పాత బస్టీలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు.

పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మాచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నవంబరు 29, 30 తేదీల్లో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్‌ను శుక్రవారం మాచర్ల పట్టణంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, డైరెక్టర్ జున్నా శ్రీనివాస్ దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, కథ రచన, కథ విశ్లేషణ, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, స్పెల్ బీ, ఏకపాత్రాభినయం, మైము, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, లఘు నాటికలు, జానపద నృత్యం తదితర 65 అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నవంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కమిటీ ఇన్‌చార్జి ఆయేషా సుల్తానా, ఆర్గనైజేషన్ హెడ్ నెల్లూరి బ్రహ్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ కోట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిమ్ ట్రైనర్ ఆత్మహత్య

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉన్న ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న యువకుడు ఇంటిలో ఉరి వేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. తేలప్రోలుకు చెందిన పఠాన్ మహబూబ్ ఖాన్ (25) తన బంధువులకు చెందిన జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంటిలోనే నివాసం ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండగా మృతుని అమ్మమ్మ గుర్తించి.. కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రేమ విఫలం కావడమే ఆత్మహత్యకు కారణం అయి ఉండవచ్చునని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

1,550 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యంతో అర్బన్ సీఐ

పొన్నూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 1,550 కేజీల రేషన్ బియ్యంను అర్బన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరానాయక్ కథనం ప్రకారం.. పట్టణంలో గస్తీ పోలీసులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గురించి సమాచారం అందింది. దీంతో ఎస్సై బి.శ్రీహరితో కలిసి సీఐ పట్టణంలో సోదాలు నిర్వహించారు. షరాబజార్ సమీపంలో ఒక ట్రాలీని ఆపగా.. ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. షేక్ మెమన్‌బాషా అలియాస్ రబ్బాని, మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన అవ్వారు శ్రీనివాసరావు, నిజాపట్నంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన పేరు చందనం అంకమ్మ నాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 31 బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యం గుర్తించారు. పట్టణంలోని మునీర్ అనే రేషన్ డీలర్ నుంచి బియ్యం కొనుగోలు చేసి.. బోడపాడు గ్రామానికి చెందిన గోవతోటి ఆనంద వద్దకు తరలిస్తున్నట్లు పట్టుబడిన వ్యక్తులు వెల్లడించారు. పట్టుబడిన ముగ్గురితో పాటు రేషన్ డీలర్ మునీర్, బోడపాడుకు చెందిన ఆనంద్‌పై నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరా నాయక్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

చెంచుపేట హత్య కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంచుపేట వద్ద గత మంగళవారం జరిగిన హత్య కేసును 3వ పట్టణ పోలీసులు ఛేదించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, కోరుతాడిపర్రుకు చెందిన జూటూరి తిరుపతిరావు (60)కి అదే గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు (36)కి గ్రామంలోని రామాలయం, చేపల చెరువు విషయంలో సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. వెంకట సుబ్బారావు తండ్రి కాలం నుంచి గ్రామంలో తిరుపతిరావుకి మెజార్టీ మద్దతుతో పైచేయిగా నడుస్తోంది. దీనిని జీర్ణించుకోలేని వెంకటసుబ్బారావు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో తెనాలికి మకాం మార్చి కూలి పనులు చేసుకుంటున్న అతను.. తిరుపతిరావు అనారోగ్యంతో తెనాలిలోని పెద్ద కుమార్తె వద్ద ఉంటూ వైద్యం చేయించు కుంటున్నాడని తెలుసుకున్నాడు. కొన్ని రోజులు రెక్కి నిర్వహించి.. గత మంగళవారం తిరుపతిరావు చెంచుపేటలోని ఓ టిఫెన్ సెంటర్ వద్ద ఉండగా గుర్తించి కొబ్బరికాయల కత్తితో పాశవికంగా అతనిని నరికాడు. మృతి చెందాడని పూర్తిగా నిర్ధారించుకుని అక్కడ నుంచి స్కూటీపై పరారయ్యాడు. శుక్రవారం సోమసుందరపాలెం కాల్వ కట్ట రోడ్డు నుంచి వస్తున్నట్లు సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నిందితుడు గతంలో కూడా పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన సీఐ సాంబశివరావు, సిబ్బందిని అభినందించారు. ఎస్ఐలు కరిముల్లా, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తికి నిదర్శనం..

మహిళల కబడ్డీ టోర్నమెంట్



విజేత జట్టుకు బహుమతుల ప్రదానం

తాడికొండ(లాం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తికి నిదర్శనం మహిళల కబడ్డీ టోర్నమెంట్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ డీ.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న ప్రతిభ గర్వకారణం అన్నారు. క్రీడ లు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి మూలం అన్నారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితానికి దారితీయాలి అని పేర్కొ న్నారు. ఈ రోజు జరిగిన పోటీల్లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రథ మ బహుమతిని, తెనాలి జేఎంజే డిగ్రీ కళాశాల ద్వితీయ బహుమతిని, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం తృతీయ బహుమతిని, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చతుర్థ బహుమతిని సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, ఫిజికల్ డైరెక్టర్లు రాఘవయ్య, భాను ప్రకాష్, విశ్వవిద్యాలయం క్రీడా విభాగాధిపతి, తదితరలు పాల్గొన్నారు.

42,710 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 37,368 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,710 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,578 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12600
334	10000	15000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14800
341	10000	15500	341	10000	15800
4884	----	----	4884	10000	14000
సూపర్ 10	----	----	సూపర్ 10	10000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు



సుగుణరాజు మృతదేహం

విజయపురిసౌత్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆటో వెనుకగా ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి కుడి కాలువ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మాచర్ల మండలం కొత్తూరులో హస్త కళల వారికి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ట్రైనర్ ఎస్.సుగుణరాజు, ఫిలిప్, వంగడ రమేష్ కొత్తూరు గ్రామం నుంచి పోచం నరసింహరావు అనే వృద్ధుడి ఆటోలో మాచర్ల పట్టణానికి బయలుదేరారు. మార్గ మధ్యంలోని ఏడో మైలులో గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగమల్లీశ్వరి, మరో వ్యక్తి ఆటోలో ఎక్కారు. తాళ్లపల్లి సమీపంలోని కుడికాలువ వద్దకు రాగానే రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఆటో వెనుకగా ఢీకొట్టింది. దీంతో హస్తకళల ట్రైనర్ ఎస్.సుగుణరాజు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. వార్డెన్ నాగమల్లీశ్వరి, ఫిలిప్‌లకు తీవ్ర గాయాలు, రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు.

కోటప్పకొండ ఆలయ హుండీల

ఆదాయం రూ.59.97 లక్షలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకల లెక్కింపు ఈఓ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మాబాయి నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.55,76,935లు, అన్నదానం హుండీ ద్వారా రూ.4,20,319లు, మొత్తం రూ.59,97,254లు(102 రోజులకు) వచ్చినట్లు ఈఓ డి.చంద్రశేఖరరావు తెలిపారు. వెండి 330, బంగారం 51.500 గ్రాములు, 96 అమెరికన్, 140 కెనడా, 100 యూఏఈ డాలర్లు హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు.

బాపట్ల పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. 1083/2025/ఇ1 తేది. 17.10.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన అభివృద్ధి పనిని చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హత గల రిజిష్టరు కాంట్రాక్టరు దారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in (procurement place) వద్ద చూడగలరు మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత విభాగము నందు అడిగి తెలుసుకొనగలరు.

పనుల సంఖ్య :- 1

అంచనా విలువ :- రూ॥ 8,91,199/-

1. టెండరు బిడ్‌లు ప్రారంభ తేది. : 18.10.2025 ఉదయం 10.00 గం॥లకు
2. టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరు తేది. : 01.11.2025 సాయంత్రం 4.00 గం॥లకు
3. టెండరు బిడ్‌లు స్వీకరించు చివరి తేది. : 01.11.2025 సాయంత్రం 5.00 గం॥లకు

సం/- కమీషనరు,
బాపట్ల పురపాలక సంఘం

పత్తి పంట పరిశీలన


పత్తి పైరుని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

దాచేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దర్శి కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో పత్తిలో అంతర్ సాగు పద్ధతిని శుక్రవారం సందర్శించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివన్నారాయణ దాచేపల్లి మండలంలో పత్తిపొలాలను పరిశీలించారు. రెండో పంటగా వరి, శనగ పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. రైతులకు పంటలను ఆశ్రయిస్తున్న చీడపీడల నివారణ మందులను వివరించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేష్, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది కే భవ్య, ఎం వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు ఉన్నారు.

స్వయం శక్తితో ఎదిగే శ్రమజీవికి చేయూత

● దాచేపల్లిలో ఆటోలతో భారీ ర్యాలీ


దాచేపల్లిలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ బ్యానర్లతో ర్యాలీని ప్రారంభిస్తున్న కూటమి నేతలు

దాచేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తితో ఎదిగే శ్రమజీవికి చేయూతనిచ్చే పథకాల అమల్లో కూటమి ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీలో ఇటీవల ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం దసరా కానుకగా ఆర్థికసాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మండలంలోని ఆటోడ్రైవర్లందరూ కూటమి ప్రభుత్వానికి సంఘీభావంగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. నారాయణపురంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా, పాత బస్టాండ్ సెంటర్, తంగెడ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి నారాయణ, తంగెళ్ళ శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ షేక్ అహమద, యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతీ బద్రి, పాముల కిషోర్, కొప్పుల నాగేశ్వరరావు, నర్ర పుల్లయ్య, కోట శాయన్న, ఐనాల శ్రీరాములు, మునగ నిమ్మయ్య, రుద్రాల అచ్చారావు, కూరాకుల నాగేశ్వరరావు, సాధినేని కోటేశ్వరరావు, అఫీజ్, తుల్లా, మాధవి, సకినాబీ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల అమ్మకానికి అనుమతులు తప్పనిసరి


గురజాల: సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసులు అమ్మకానికి అనుమతులు తప్పనిసరి అని ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో టపాసులు అమ్ముకునే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. జీఎస్టీ, నగర పంచాయతీ, అగ్నిమాపక, పోలీస్‌స్టేషన్‌లలో చలానాలు చెల్లించి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారుల సూచనలు పాటించాలన్నారు. అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రెవన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

సత్తెనపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామ సాగర్ ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో తాత్కాలికంగా దీపావళి మందుల షాపులను ఏర్పాటుచేయటానికి స్థలాన్ని ఆర్డీవో రమణా కాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ అగ్నిమాపక సిబ్బందితో కలసి పరిశీలించారు. లైసెన్స్‌పొందిన రిటైల్ వ్యాపారులు ఇక్కడ బాణసంచా విక్రయించుకోవాలని అధికారులు తెలిపారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయించటం నేరమన్నారు.


సత్తెనపల్లి: బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో, ఇతర అధికారులు

ఆర్డీవో అనుమతి తీసుకోవాలి

నకరికల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలో దీపావళి మందులు అమ్మదల్చిన వ్యాపారులు ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ కే పుల్లారావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత తహసీల్దార్, సత్తెనపల్లి సీఐ, అగ్నిమాపక అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. తరువాత పంచాయతీ కేటాయించిన స్థలంలోనే దీపావళి మందుల అమ్ముకోవాలన్నారు. అనుమతి లేకుండా అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

క్రోసూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణ సంచా దుకాణాలను ఏర్పాటుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ పీ రవిబాబు శుక్రవారం హెచ్చరించారు. బాణసంచా తయారీ, విక్రయ దారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. తహసీల్దార్, ఎస్ఐ, ఫైర్ అధికారి, పంచాయతీ కార్యదర్శులతో కూడిన కమిటీ నిర్ణయించిన చోటనే బాణసంచా విక్రయించుకోవాలని తెలిపారు.

● రెంటచింతల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసుల దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. అనుమతులు తీసుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. టపాసుల దుకాణాలను ఊరికి దూరంగా ఏర్పాటుచేసుకోవాలని ఎస్ఐ కోరారు.

ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం

ఎన్ఎఫ్ఏ అప్పలరాజు

పిడుగురాళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఏటీఎం మోడల్ ద్వారా నిరంతర ఆదాయం సమకూర్చుకోవచ్చని ఎన్ఎఫ్ఏ అప్పలరాజు అన్నారు. మండలంలోని గుత్తికొండలో ఉప్పుతోళ్ల రేణుక పొలంలో ఏటీఎం మోడల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఏటీఎం మోడల్ అనేది కనీసం 20 సెంట్లు వేసి 4 అడుగులకు ఒక బెడ్ తయారు చేసుకొని ఒక్క అడుగు కాలువ నిర్మించుకొని 20 రకాల తీగ, దుంపజాతి, ఆకుకూరలు పంటు ఉండేలా చూడాలన్నారు. ఆకు కూరలు 15నుంచి 20 రోజుల్లో ఆదాయం రావడం మొదలవుతుందన్నారు. భూమి ఖాళీగా ఉండకుండా ఎప్పుడూ మొక్కలతో నిండి ఉండేలా చూసుకొని పండించడం ద్వారా రైతుకు ప్రతి రోజూ ఆదాయం వస్తుందన్నారు. రేణుక పొలంలో 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాష్టర్ ట్రైనర్ బాజీబాబు, కిరణ్, యూనిట్ ఇన్‌చార్జి రేణుక, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అధికారుల తనిఖీ

గురజాలటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం కస్తూర్బాగాంధీ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో గౌసియాబేగం తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట కార్యదర్శులు లక్ష్మానాయక్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో..

బెల్లంకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ సోషల్ వెల్ఫేర్ పాఠశాల, బెల్లంకొండ కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో సునీత తనిఖీ చేశారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగు దొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరమైన ఆహారాన్ని అందించాలని, మెను ప్రకారమే భోజనాలను అందించాలన్నారు. అనంతరం మంచినీటి వాటర్ ప్లాంట్‌ను, పాఠశాలలో వంటగదిని ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఉన్నారు.


బెల్లంకొండ: కేజీబీవీలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీత

క్రోసూరులో..

క్రోసూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని కేజీబీవీ పాఠశాల, మోడల్ స్కూళ్ళల్లో స్థానిక అధికారులు తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆహార నాణ్యతను నిశితంగా పరీక్షించారు. మెను ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదా? విచారించారు. ఆర్‌వో ప్లాంట్‌ను పరిశీలించారు. అభ్యసన సమార్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ రవి కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవోలు జీ కృష్ణ, ఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.


క్రోసూరు: పాఠశాలల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

అచ్చంపేటలో..

అచ్చంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ఎస్టీ హాస్టల్, కస్తూర్బా బాలికల పాఠశాలలను ఎంపీడీవో కే శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ హాస్టళ్ళలో రూమ్‌ల పరిశుభ్రత, భోజనం తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతో పాటు డిప్యూటీ ఎంపీడీవో కే మురళీకృష్ణ, వీఆర్‌వో పంతులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల నిరసన

పెదకూరపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కంచర్ల జాన్‌బాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఈ దాడికి నిరసనగా శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నీలి ధనలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేలపాటి ఏసోబు, గొల్లపూడి కోటేశ్వరరావు, జోజిబాబు, తాళ్ళూరి చిట్టిబాబు, గుడేటి రాజేష్, కంచర్ల ఏసయ్య తదితర ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


దుర్గి: నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

● దుర్గి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు న్యాయం చెప్పే వ్యక్తిపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. దాడిపై సీనియర్ జడ్జిలతో విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎండూరి నాగరాజు, ఇంజమూరి శ్యామ్, ఆరోను, ఆంధ్రయ్య, కనకరాజు వెంకయ్య, బొల్లెద్దుల మరియదాసు, పుల్లయ్య, మాచర్ల వంశి, బుజ్జి, విజయ్, అందుగుల పుష్పరాజు, రాయపాటి ప్రకాష్, ప్రసాద్, కందుకూరి అభిషేక్, చాట్ల మనోజ్, బొల్లెద్దుల అజయ్, రాయపాటి దాసు, కందుకూరి ఆశాదీప్, లోకేష్, అజయ్, చందు, చిన్నోడు పాల్గొన్నారు.


పెదకూరపాడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు

● కారంపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ కారంపూడిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. మాచర్ల రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి నల్లజెండాలతో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తాళ్లూరి జీవరత్నం, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కడియం మరియదాసు, కోట దాసు, తాళ్ల పోగు చంటి తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసనగా శుక్రవారం మాచర్లలో ఎమ్మార్పీఎస్ నేతలు నిరసన ర్యాలీ జరిపారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మాచర్ల డానియేలు, మండల ఇన్‌చార్జి మాచర్ల రూబెన్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు బాబు, ఊరే మార్కు, మాదిగ స్టూడెంట్ లీడర్ హరీష్, శివ, పవన్, సందీప్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ కేంద్ర విద్యాలయంలో వార్షిక తనిఖీ

సత్తెనపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం వద్దగల పీఎం శ్రీ కేంద్ర విద్యాలయంలో శుక్రవారం హైదరాబాద్ నుంచి వివిధ శాఖల అధికారులు వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠ్య కార్యకలాపాలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, విద్యార్థి, ఉపాధ్యాయ పరస్పర సంబంధాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులు, ప్రయోగ శాలలు, గ్రంథాలయం, వివిధ విభాగాల పట్ల చూపుతున్న శ్రద్ధ, సమర్థవంతంగా నిర్వహిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను తనిఖీ బృందం ప్రశంసించింది. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వార్షిక ప్రగతి సంచికను తనిఖీ బృందం, హెచ్‌ఎం జగదీష్‌కుమార్ గుప్త ఆవిష్కరించారు. ఆరీస్ సంస్థ ఎక్సలెంట్ స్కూల్ అవార్డును ప్రదానం చేశారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించటం పట్ల ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందించారు.

నేడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

పిడుగురాళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, ఆర్డీవో మురళీకృష్ణ హాజరుకానున్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, నేతలు పాల్గొనాలని కమిషనర్ శ్రీనివాసులు కోరారు.

వీరుల గాధలో.. పరిఢవిల్లిన ఆధ్యాత్మికం

పల్నాడు అంటే దాయాదుల పోరు.. శైవ, వైష్ణవ మత సంఘర్షణలు.. ఎందరో వీరుల మరణాలు.. ఇదే చాలా మందికి తెలుసు.. కానీ పల్నాట 12వ శతాబ్దంలోనే సర్వమత సమానత్వం.. ఆధ్యాత్మిక చింతన పరిఢవిల్లిందనే విషయం అతి కొద్ది మందికే అవగతం. నాటి గుర్తులు నేటికీ పదిలంగానే ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే భావితరాలకు చరిత్రను అందించడంతోపాటు దేశ చరిత్రలో మన కంటూ స్థానం సంపాదించవచ్చు. రాజులు, రాజ్యాలు, వీరులు, వీరగాథలు.. తనలో ఇముడ్చుకుంది నాటి కార్యమపూడి.. నేటి కారంపూడి.

- కారంపూడి, ఆంధ్రజ్యోతి

పల్నాట సర్వమత సమానత్వం

నాటి సాక్ష్యాలు నేటికీ సజీవం

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం మేళవింపు

నాటి కార్యమపూడి.. నేడు కారంపూడి

పర్యాటకం.. ప్రశ్నార్థకమేనా..?

మంత్రాలమ్మ కనుమ

నాటి కార్యమపూడి నేడు కారంపూడిగా పిలువబడుతోంది. యుద్ధ భూమికి దక్షిణ భాగాన నాలుగు మైళ్ల దూరంలో ఉన్న మంత్రాలమ్మ కనుమను నాయకురాలి కనుమగా పిలుస్తుంటారు. అక్కడ మంత్రాలమ్మ అమ్మవారి దేవాలయం పల్నాటి యుద్ధం జరిగిన 1184కు పూర్వమే ఉంది. ఈ అమ్మవారి దేవాలయాన్ని మహిమ గల దేవతగా ఆ నాటి నుంచి ఈ ప్రాంత వాసులు కొలుస్తుంటారు. పల్నాటి యుద్ధానికి తన సైన్యంతో బ్రహ్మనాయుడు త్రిపురాంతకం వద్ద ఉన్న మేడపి నుంచి తరలివస్తుంటాడు. సమాచారం తెలిసిన నాయకురాలు నాగమ్మ.. బ్రహ్మన్న సైన్యాన్ని యుద్ధ భూమికి రానీవ్వకుండా మంత్రాలమ్మ కనుమ వద్ద రహదారి లేకుండా చేస్తుంది. దీనికి ఆగ్రహించిన బ్రహ్మనాయుడు కనుమ వద్దనున్న కొండను తన ఆయుధమైన నృసింహకుంతంతో నరికి దారి చేసుకొని సైన్యాన్ని ముందుకు నడిపించాడు. నాయకురాలు నాగమ్మ అడ్డు వేయడంతో ఈ మంత్రాలమ్మ కనుమకు నాయకురాలి కనుమగా పేరొచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. బ్రహ్మనాయుడు కుమారుడైన బాలచంద్రుడు ఈ కొండపై నుంచే తన గుర్రాన్ని దూకించాడని ఆ ప్రదేశంలో చూపిస్తుంటారు. ఇప్పటికీ వీరాచార వంతులు ప్రతి ఆదివారం మంత్రాలమ్మ అమ్మవారికి పూజాదులు చేసి నివేదనలు అర్పిస్తుంటారు. మహిమ గల శక్తి అమ్మవారుగా ఈ ప్రాంత వాసుల నమ్మకం.

చెన్నకేశవస్వామి ఆలయం

కారంపూడిని మాచర్ల, గురజాల రాజులు తమ యుద్ధభూమిగా నిర్ణయించకముందే ఇరు రాజ్యాల రాజులు కారంపూడికి వస్తుంటారు. కారంపూడిలో చెన్నకేశవస్వామి దేవాలయాన్ని బ్రహ్మనాయుడు నిర్మించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దర్శనానికి వచ్చేటప్పుడు బ్రహ్మనాయుడు తన మేడలో విశ్రమించేవారు. చెన్నకేశవస్వామి దేవాలయంలో ఒక బావి ఉంది. గంగధార మడుగులో స్నానమాచరించి నేరుగా ఈ బావి నుంచి వెలుపలకు వచ్చి చెన్నకేశవస్వామిని దర్శించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. కాగా ఈ బావి ప్రస్తుతం మూసివేశారు. ఈ బావిలో నీరు తీర్థంగా తాకితే ఎక్కడలేని పౌరుషం పుట్టుకొస్తుందని, అందువల్ల అనర్థాలకు దారితీస్తుందని మూసి వేశారని చెబుతారు. వీరారాధన ఉత్సవాలు లేని సమయంలో బ్రహ్మనాయుడు నృసింహ కుంతం, కన్నమదాసు భైరవఖడ్గం, బాలచంద్రుడి సామంత రాగోల ఆయుధాలు ఈ దేవాలయంలోనే భద్రపరుస్తారు. ఉత్సవాల సమయంలో వీరాచార వంతులు తమ కొణతములతో చెన్నకేశవస్వామి ఆరాదిస్తారు. బ్రహ్మనాయుడు ఈ ఆలయంలోనే సర్వమత సమానత్వం కొరకు సహపంక్తి భోజనాలు పెట్టేవారు. క్రీస్తు శకం 1315లో ఈ ఆలయ పునరుద్ధరణ జరిగినట్లు కథనం.



యుద్ధభూమి



కోట బురుజు

రాక్షస సొరంగాలు..

పెదకొదమగుండ్ల రహదారిలో ఆనాటి రాక్షస సొరలు (సొరంగాలు) నేటికీ కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలోనే బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం కనిపిస్తుంది. కాగా గురజాల రాజ్యంగా పాలిస్తున్న మంత్రి నాయకురాలి నాగమ్మ తన సైన్యంతో కారంపూడి యుద్ధ భూమికి తరలి వచ్చేటప్పుడు ఈ రాక్షస సొరంగాల గుండా రాక్షస బండకు చేరుకొని విశ్రమించారని చరిత్రకారులు చెబుతున్నారు. 12వ శతాబ్దపు జ్ఞాపకాలు చారిత్రక చిహ్నాలు నేటికీ సజీవంగా కనువిందు చేస్తున్నాయి.

ముస్లింలు నిర్మించిన వీర్ల దేవాలయం



పల్నాటి యుద్ధం అనంతరం ఔరంగజేబు సైనికులు కారంపూడి మీదుగా వెళ్తూ యుద్ధ భూమిలో విశ్రమించారు. వీరుల రాతి చిహ్నలను రాళ్లుగా బావించి వంటావార్పు చేశారు. భోజనం అనంతరం సైనికులు నురగలు కక్కుతూ పడిపోగా చెన్నకేశవస్వామి వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో అక్కడకు వచ్చి వీరుల చరిత్రను వివరించి వారిని కాపాడినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో జాఫర్, ఫరీద్ అనే సోదరులు యుద్ధ భూమిలో వీర్ల దేవాలయం నిర్మించి అక్కడే జీవసమాధి పొందారు. హిందూ దేవాలయంలో ముస్లింల సమాధులు ఉండడం, ఆ సమాధుల వద్ద నేటికీ ప్రజలు పూజలు నిర్వహిస్తుండడం విశేషం. కాగా ఈ ఆలయంలో కన్నమదాసు (మాల సామాజిక వర్గీయుడు)కు గుడి కూడా ఉంది. 12వ శతాబ్దంలోనే పల్నాటి బ్రహ్మనాయుడు సర్వమత సమానత్వం పాటిస్తూ చాపకూడు (సహపంక్తి భోజనాలు) నిర్వహించారనే చారిత్రక ఆధారాలున్నాయి. నేటికీ వీరారాధన ఉత్సవాల్లో వీర్ల గుడి ప్రాంగణంలో కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసి చాపకూడులో పాల్గొంటారు.

నాగులేరులోని గంగధార మడుగు..

వీర్ల దేవాలయ సరిహద్దులో దక్షిణం నుంచి ఉత్తరంగా ప్రవహిస్తోంది నాగులేరు. ఇక్కడ నాగులు అనే జాతి వారు నివసించారని, అందుకే దీనికి నాగులేరు అనే పేరు వచ్చిందంటారు. ఈ నాగులేరులో నీటి మడుగు అంతరవాహినిగా ఉంది. ఆ మడుగునే గంగధారి మడుగు అని వ్యవహరిస్తుంటారు. ఉత్తర వాహినిగా ప్రవహించే నదిని పుణ్యనది అంటారు. ఈ నదినే కాశిలోని మణికర్ణిక ఘాట్‌తో శ్రీనాథ మహాకవి పోల్చారు. ఈ మడుగులో వీరాచారవంతులు స్నానాథులు చేయడమే కాకుండా తమ ఆయుధాలకు ఈ మడుగులో స్నానమాచరింపజేస్తారు. కోట బురుజు నుంచి బాలచంద్రుని పొట్టేలు దూకగా పడిన గిట్టల గుర్తులు ఇప్పటికీ ఉన్నాయి. ప్రజలు ఇప్పటికీ ఈ గుర్తుల వద్ద పూజలు చేస్తుంటారు.



మంత్రాలమ్మ అమ్మవారు

మరికొన్ని ముఖ్య ప్రదేశాలు

కాగా కారంపూడిలో సందర్శించవలసిన మరికొన్ని ముఖ్య ప్రదేశాలు ఉన్నాయి. యుద్ధభూమికి ఎదురుగా పల్నాటి యుద్ధానికి పూర్వమే అంకాళమ్మ దేవాలయం ఉంది. ఈ దేవాలయ కిటికీలో నుంచి అమ్మవారు యుద్ధం వీక్షిస్తూ వీరుల మరణాలకు చలించి తల ఒరిగిపోయి కన్నీరు కార్చింది. అమ్మవారి కన్నీరు కింద పడితే అరిష్టమని ఆనాడు పూజారులు గిన్నెను అమర్చారు. ఇప్పటికీ గిన్నె అలానే ఉంది. అలాగే కన్నమదాసు మేడ, వీర్ల దేవాలయంలోని నాటి వీరుల ఆయుధాలు, బ్రహ్మనాయుడు ప్రతిష్ఠించిన కాలభైరవుని విగ్రహం, శంకుతీర్థ మండపం, కల్లి తోరణం, కారంపూడి గ్రామానికి రక్షణ కోసం వేసిన ముగ్గు, బ్రహ్మనాయుడు మేడ, బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం, బాలచంద్రుడు విశ్రమించిన ప్రదేశం, పోతురాజు మండపం, రాక్షసబండ ఇలా అనేకం ఉన్నాయి. పర్యాటక ప్రాంతంగా కారంపూడిని అభివృద్ధి చేస్తే నాటి చరిత్రను బావితరాలకు అందించడంతోపాటు దేశ చరిత్రలో సముచిత స్థానం కల్పించినట్లవుతుందని పల్నాటి వాసులు కోరుతున్నారు.

కల్తీ వరి విత్తనాలతో.. రోడ్డెక్కిన రైతులు

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్తీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులు రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేయాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన 35 మంది రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో కొల్లూరులోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించి, ఏవో సురేంద్రబాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. పది రోజుల క్రితం ఎన్నారై విత్తన సంస్థ అందించిన బీపీటీ విత్తనాలు బెరుకు ఉందని రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించడం జరిగిందన్నారు. దీంతో మండల వ్యవసాయాధికారి అనంతవరంలో బెరుకు వచ్చిన వరి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నారై విత్తన పరిశోధన ప్రతినిధులతో చర్చించారని తెలిపారు. వారు కూడా గ్రామానికి చేరుకుని రైతుల సమక్షంలో పంట పరిశీలన అనంతరం పంటలో బెరుకు వచ్చిన మాట వాస్తవమని ఎకరాకు ఐదు బస్తాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తమ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధులతో చర్చించి న్యాయం చేస్తామంటూ 15వ తేదీ వరకు గడువు కావాలని కోరారన్నారు. దానికి అంగీకరించిన రైతులు.. ఇప్పుడు తమకేం సంబంధం లేదని విత్తన సంస్థ ప్రతినిధులు చేతులు ఎత్తి వేయడంతో న్యాయం చేయాలంటూ వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వినతి పత్రం ఇచ్చినా ఏవో పట్టించుకోకపోవడంతో కడుపు మండిన రైతులు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద తెనాలి - రేపల్లె ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు, మండల నాయకులు సుబ్బారావు, రైతులు ధూళిపాళ్ల రవి, జాలాది రంగారావు, నాగళ్ల కృష్ణారావు, ధూళిపాళ్ల చిన్న, కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల రాంబాబు, ధూళిపాళ్ల నాని, కౌలు రైతులు రామకోటయ్య, వాసు, రామారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన అనంతవరం గ్రామ రైతులు

సీటు.. వదిలేది లేదు!

డీఎంహెచ్ఓ ఆదేశాలు బేఖాతర్

వైద్యాధికారి తీరుపై ఆరోగ్య శాఖలో విస్మయం


ప్రజా ప్రతినిధి వద్దకు క్యూ కడుతున్న నేతలు

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో వింత పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇచ్చిన ఆదేశాలను ఒక వైద్యాధికారి పక్కన పెట్టడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒక వైద్యునిపై రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మండలానికి చెందిన నాయకులు కూడా ముఖ్య ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి సదరు ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న విషయాలను వివరించారు. దాంతో విచారణ నిర్వహించిన జిల్లా అధికారులు సంబంధిత వైద్యుని డ్రాయింగ్ పవర్స్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివాదాస్పద వైద్యుని డ్రాయింగ్ పవర్స్ తొలగించి, అదే ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న మరో వైద్యురాలికి బాధ్యతలు అప్పగిస్తూ సెప్టెంబరు 16న డీఎంహెచ్ఓ కె విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్ఓ ఆదేశాలు ఇచ్చిన వెంటనే వాటిని అమలు చేయాల్సి ఉండగా మహిళా వైద్యురాలిని పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలోని కొందరు ఉద్యోగులు బెదిరిస్తున్నట్లు వార్తలు బయటకు రావడం చర్చనీయాంశమైంది. డీఎంహెచ్ఓ ఆదేశాలకు అనుగుణంగా చార్జి అప్పగించకుండా కాలయాపన చేయడం.. మహిళా వైద్యురాలిని కొందరు బెదిరిస్తూ ఉండటంతో అక్కడ ఉన్న నేతలు మళ్లీ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న వైద్యున్ని ఫిరంగిపురం బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారని కూడా తెలిసింది. ఈ విషయాలను డీఎంహెచ్ఓ కె.విజయలక్ష్మి దృష్టికి తీసుకు వెళ్లగా పెదనందిపాడు పీహెచ్‌సీ డ్రాయింగ్ పవర్స్ డాక్టర్ ప్రియం వదకు వెంటనే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశానని చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బాణసంచా దుకాణాల్లో ఆర్డీవో తనిఖీ

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట మండల పరిధిలోని బాణసంచా దుకాణాలను నరసరావుపేట ఆర్డీవో మధులత తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్సులు, రికార్డులు, సరుకు నిల్వలు, తీసుకున్న భద్రతా చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె చిలకలూరిపేటలో మొత్తం 24 దుకాణాలు ఉన్నాయని, వాటిలో 17 రిటైల్ షాపులు, 7 హోల్ సేల్ షాపులు ఉన్నాయని తెలిపారు. అన్ని దుకాణాలను తనిఖీ చేస్తామన్నారు. దుకాణాలవారు నిబంధనలు పాటించాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బండ్లమోటు ఎస్ఐగా షమీర్ బాషా

బొల్లాపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బండ్లమోటు పోలీసుస్టేషన్ ఎస్ఐగా సమీర్ బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బాలకృష్ణ వినుకొండ పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సమీర్ బాషా వినుకొండ టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై బండ్లమోటుకు వచ్చారు.

సీఎం నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధి: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ రాకతో ముఖ్యంత్రి చంద్రబాబునాయుడు విశ్వసనీయత, పట్టుదల ఫలితం ఎలా ఉంటుందో మరోసారి నిరూపితం అయిందన్నారు. గూగుల్ రైడెన్ రూ.1,33,200 కోట్ల పెట్టుబడికి సిద్ధమైందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ సంస్థ విశాఖలో 1.35 లక్షల కోట్లతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు క్యాప్టివ్ పోర్టులను అభివృద్ధి చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. వైసీపీ హయాంలో కబ్జాలు, సెటిల్‌మెంట్లు, చోరీలు, దందాలు, అసాంఘీక కార్యకలాపాలతో నిత్యం వార్తలలో నిలిచిన విశాఖనగరం, కూటమి ప్రభుత్వంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల రాకకు సంబంధించిన వార్తలలో నిలుస్తోందన్నారు.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆవుల సుబ్బారావు కాంప్లెక్స్‌లో నరసరావుపేట నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు పోతుల శంకర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మంచాల తిరుపతిరావు, అల్లంశెట్టి మోహనరావు, రాయల శ్రీనివాసరావు, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసన

రొంపిచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో న్యూఢిల్లీలో జరిగిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా శుక్రవారం ర్యాలీ చేపట్టారు. మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక చెరువు కట్ట సెంటర్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్ళి తహసీల్దార్ బండి నిర్మలకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ మక్కెన పుట్టయ్య, కొమ్ము ప్రకాష్, పోలెపోగు రాములు, కొత్తపల్లి జయరావు, బుట్టి అచ్చయ్య, బందెల జేమ్స్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి: పంచాయతీ కార్యదర్శి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి నాని తెలిపారు. మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం గ్రామ సమైఖ్య సహాయకులు, డ్వాక్రా మహిళలకు మొత్తం 92మందికి థీమ్ 5పచ్చదనం, పరిశుభ్రత కలిగిన గ్రామంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై మహిళలకు అవగాహన

వినుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్లీన్ అండ్ గ్రీన్‌పై ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పుట్టారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఏవో చుట్టూరి రవి, ట్రైనర్ ఆలీషా పాల్గొన్నారు.

బాణసంచా దుకాణ దారులు లైసెన్స్‌లు పొందాలి: తహసీల్దార్

రొంపిచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీపావళి మందుల దుకాణ దారులు లైసెన్స్‌లు పొందాలని తహసీల్దార్ బండి నిర్మల శుక్రవారం తెలిపారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీ ఏర్పాటుచేయాలన్నారు.

ఘనంగా డాక్టర్ జాన్ డేవిడ్ జయంతి

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఎంజీ, ఫార్ కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ ఎస్.జాన్ డేవిడ్ జయంతిని ఆయా సంస్థల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్ కార్నర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీఎస్ బర్నబాస్ ఆధ్వర్యంలో జాన్ డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

కొంకేరు వాగులో అల్లుకుపోయిన తూటుకాడ



కొంకేరు వాగులో భారీగా ఉన్న తూటుకాడ

● ముందుకు సాగని ప్రవాహం

ఈపూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొంకేరు వాగులో తూటుకాడ అల్లుకుపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగకుండా అడ్డుపడుతోంది. వర్షాలు పడినప్పుడు వాగు ఉధృతికి తూటుకాడ అడ్డుపడుతుండటంతో వాగు పొంగి పంటలకు నష్టం వాటిల్లుతోంది. అంతేకాకుండా బొగ్గరం సమీపంలో కొంకేరువాగుపై నిర్మించిన బ్రిడ్జికి ముప్పు ఏర్పడుతోంది. కొంకేరు వాగు నీటితో ఈపూరు, శావల్యాపురం, వినుకొండ మండలాలకు చెందిన దాదాపు 10గ్రామాల ప్రజలు సాగు, తాగు నీటికి ఉపయోగించుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ గ్రామాల ప్రజలు తాగు, సాగునీటి కోసం ఇబ్బందులు పడతారు. సంబంధిత అధికారులు స్పందించి వాగులో అల్లుకుపోయిన తూటుకాడను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలను అండగా సీఎం సహాయ నిధి పథకం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వినుకొండ చీఫ్ విప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు జీవీ ఆంజనేయులు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 మాసాలలో వినుకొండ నియోజకవర్గంలోని 1147 మందికి 7కోట్ల 90 లక్షల 52వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. వైసీపీ హయాంలో నామమాత్రంగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చారన్నారు. అయితే నాడు ఆరోగ్యశ్రీ పథకం బిల్లులు ఇవ్వని కారణంగా ఆ పథకం నిర్వీర్యమైందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి నిధులు సకాలంలో అందిస్తూ పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద 400 కోట్లు పంపిణీ జరిగిందన్నారు. కాగా శుక్రవారం నాడు నియోజకవర్గంలోని 62 మందికి 40 లక్షల 63 వేల 300 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి షకీలా, ఐడీసీ పెమ్మసాని నాగేశ్వరరావు, యార్డు చైర్మన్లు మురళీకృష్ణ యాదవ్, గోవింద నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, నర్రా కిషోర్. తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

వినుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్‌విప్ జీవీ పేర్కొన్నారు. పోలీసుల వల్ల తమకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని వినుకొండ పట్టణంలో తోపుడు బండ్ల వ్యాపారులు చీఫ్ విప్ జీవీకి విన్నవించారు. టౌన్ సీఐతో దీనిపై చర్చించారు. తోపుడు బండ్లు లేని వారు ఉంటే శివశక్తి ఫౌండేషన్ నుంచి బండ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

ట్రంప్ ఉగ్రవాదంతో అగమ్యగోచరంగా భారతీయ విద్యార్థుల భవిష్యత్తు

● సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రంప్ ఉగ్రవాదంతో వేలాది భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల లలిత కళా ప్రాంగణంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రంప్ పుణ్యమా అంటు టారిఫ్ ఉగ్రవాదం బ్రహ్మరాక్షసిలా భారతదేశాన్ని పీడిస్తోందన్నారు. మన దగ్గర నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యేవాటిని 50 శాతం పన్ను వేశారని, అమెరికా నుంచి ఇండియాకు దిగుమతి అయ్యేవాటి మీద సున్న శాతానికి తగ్గించమని ఒత్తిడి చేస్తుంటే తెరవెనుక మోడీ ట్రంప్‌తో చర్చలు జరుతుతున్నారన్నారు. రష్యా నుంచి ఆయిల్ కోనుగోలు చేయమని మోడీ హామీ ఇచ్చారని ట్రంప్ బహిరంగంగా ప్రకటించారన్నారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయడం మనకు లాభదాయకమైన విషయం అన్నారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయం అని చెప్పడం ద్వారా రాబోయే రోజులలో ఆయిల్ సంక్షోభం వస్తుందన్నారు. అమెరికా వత్తిడికి లొంగి దేశ ప్రజలను తాకట్టు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. పత్తి దిగుమతి సుకం తగ్గించారని, ఈ ఏడాది పత్తి ధరలు పడిపోయి రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. పౌల్ట్రీ, డైరీ ఇవన్నీ కూడా ట్రంప్ టెర్రరిజం మూలంగా నష్టం జరుగుతుందని, దీని మీద మోడీ నోరుతెరవడం లేదన్నారు. చంద్రబాబునాయుడు ఐటీ హీరో అని చెప్పుకుంటున్నారని, 40, 45 సంవత్సరాల వయస్సులో అమెరికాలో ఉద్యోగం చేసుకుంటున్న వారిపై సానుభూతి కూడా చంద్రబాబు నాయుడు ప్రకటించలేదని, భద్రత నేను ఇస్తానని హామీ కూడా లేదన్నారు. వాస్తవంగా డేటా సెంటర్‌తో రెండు మూడు వందల ఉద్యోగాలు తప్ప రావన్నారు. అందుకని చెత్త ప్రచారాన్ని ఆపేసి మన యువతకు ఉపాధి కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రంప్‌కోసం వ్యవసాయరంగాన్ని, విద్యారంగాన్ని బలిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు గద్దె చలమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు వీ కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఎస్.ఆంజనేయులునాయక్, ఏపూరి గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు డీ శివకుమారి, టీ పెద్దిరాజు, షేక్ సిలార్ మసూద్, కామినేని రామారావు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐపై రీసెర్చ్ వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ పర్పుల్ టెక్నాలజీస్ సహకారంతో రీసెర్చ్ వర్క్‌షాప్ నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం అన్నారు. ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు మట్లాడుతూ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు పరిపక్వత చెందుతారన్నారు. కొత్త విషయాలు నేర్చుకొని నూతన ఆవిష్కరణలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమో మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ షేక్ మీరా వలి, ఎగ్జిక్యూటివ్ డైరెకర్ షేక్ నజీమా, డాక్టర్ వాసంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగం డెయిరీని సందర్శించిన కేరిడ్జి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట కేరిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పరిశ్రమల పర్యటనలో భాగంగా వడ్లమూడి సంగం డెయిరీని సందర్శించారని ప్రిన్సిపాల్ జీ బర్నబస్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు పాల సేకరణ, శుద్ధి, పాశ్చరేజేషన్, ప్యాకేజింగ్ తదితర ప్రాసెసింగ్ విధానాలను పరిశీలించారు. అనంతరం స్కూల్‌లో ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ఆరెంజ్ కలర్‌డే ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జి బాపూజీ పాల్గొన్నారు.

ఎన్ఈసీ కళాశాలలో ఇన్నోవేషన్ వర్క్ షాప్

నరసరావుపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఐగ్ నైట్ ఇన్నోవేషన్ ఇంట్రా ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఇన్నోవేషన్ అనేది భవిష్యత్తును మలిచే శక్తి అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత ఆలోచన వ్యాపార దృక్పథం సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాల ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మరూరి శ్రీరామ్, ఎస్‌వీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 143మంది విద్యార్థులు ప్రముఖ విప్రో టెక్నాలజీ కంపెనీకి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ప్రముఖ ఎమ్మెన్సీ కంపెనీ అయిన విప్రో టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకొని 200మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రెండు వందలమంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 143మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు.

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ స్టేట్‌మీట్‌కి వాగ్దేవి విద్యార్థులు ఎంపిక

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ స్టేట్‌మీట్‌కి వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. టీ సూండూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజీలో ఈ నెల 15న జరిగిన పోటీలలో వాగ్దేవి విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. బేస్‌బాల్‌కు ఎంపికైన మాదినేని వెంకటేశ్వర్లు, సాఫ్ట్‌బాల్‌కు ఎంపికైన నూతి లోకేంద్రసాయి శ్రీనాథ్‌లు నవంబరు 1, 2, 3 తేదీలలో కడపలో జరిగే బేస్‌బాల్, గుంటూరులో జరిగే సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌కి పల్నాడు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

నాదెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను సొసైటీ అధ్యక్షుడు ఎన్.హరిబాబు, ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్ఎం నిర్మల ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కెల్లంపల్లి రెడ్డయ్య, కో-ఆర్డినేటర్ ఇస్మాయిల్, పీఈటీలు సుబ్బారావు, మస్తాన్, బాజీ, హనిమిరెడ్డి, శ్రీనివాస్, అమీరుద్దీన్ తదితరులు పర్యవేక్షించారు.

ధరల నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేయాలి

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధరల నియంత్రణ పర్యవేక్షక కమిటీని, డీసీటీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని శుక్రవారం నరసరావుపేటలోని డీఎస్‌వో కార్యాలయంలో వినియోగదారుల సంఘం నాయకులు డీఎస్‌వో ఎంవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు మురికిపూడి ప్రసాద్, రవినాయక్, విక్రమ్ పాల్గొన్నారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌తో పెయ్య దూడల ఉత్పత్తి

● డీఏహెచ్‌వో డాక్టర్ పీ రామారావు

నూజెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుకకు లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ పద్ధతులను అవలంబిస్తున్నట్టు డీఏహెచ్‌వో డాక్టర్ పీ రామారావు అన్నారు. మండలంలోని ముక్కెళ్ళపాడులో శుక్రవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ పెయ్య దూడలు పెంచేందుకు కృత్రిమ గర్భధారణ పద్ధతులపై గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఉచిత గర్భకోశ చికిత్సలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ టీవీ సుధాకర్, యూ.సుధాకర్, వైద్యులు శివాజీ, అమీర్ బాషా, మనోజ్, ఎంపీటీసీ చంద్ర రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, టి.బ్రహ్మయ్య, బి.రామయ్య, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు

లింగారావుపాలెంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం



క్రీడా పోటీలలో విజేతలైన బాలికలతో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

యడ్లపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికలను అన్ని విధాలా ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేవీ రామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ, ఐటీసీ, అసిస్ట్‌ల సహకారంతో మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌లో బాలికలకు శుక్రవారం క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎన్.శివరామకృష్ణయ్య, ఎన్.తాండవకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.మేరిశౌరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పున్నమ్మ, బి.అనూరాధ, టి.సుధారాణి, అసిస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సూచనల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌తో పాటు వినుకొండ వైద్యులు డాక్టర్ సుంకర అనూషలు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ, హ్యాండ్ వాష్, స్వచ్ఛ దీపావళి, పర్యావరణ పరిరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడి మృతికి ఎమ్మెల్యే అరవిందబాబు సంతాపం

రొంపిచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడుకు చెందిన మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు మంజుల ఆంజనేయులు ఈ నెల 16వ తేదీన మృతి చెందారు. కాగా ఆయన మృతికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఆంజనేయులు చేసిన సేవలను కొనియాడారు. ఆయనతోపాటు వడ్లమూడి వెంకటకిషోర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కనిగిరి బాల మురళీకృష్ణ, గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు గణిత దీప్తి పుస్తకాల పంపిణీ

నూజెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామ్‌పురం శ్రీవెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్‌లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రూపొందించిన గణిత దీప్తి పుస్తకాలను పాఠశాల హెచ్ఎం ఎస్.కామేశ్వరరావుశర్మ అందజేశారు. వంద శాతం ఉత్తీర్ణతకు తోడ్పాటునందిస్తున్నామన్నారు.

భూ సమస్యలపై సమీక్ష చేస్తా

● గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేటలో సమస్యలను వింటున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయని, వీటి పరిష్కారం నిమిత్తం త్వరలోనే నియోజకవర్గస్థాయి రెవెన్యూ సమీక్ష నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదులపై ఆయన స్పందించి సంబంధిత అధికారులకు తగిన చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు మెరుగుపర్చండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీ సేవలు మెరుగుపర్చాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీపై సమీక్ష నిర్వహించారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో సౌమ్యంగా ప్రవర్తించేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని జడ్పీ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మారిన టైమింగ్స్ ప్రకారం బస్సులు నడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అజితకుమారి, డీఈవో ఎల్ చంద్రకళ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

● ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

వినుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక నరసరావుపేట రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి: ఎంపీపీ రాధిక



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాధిక

ఈపూరు: అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని అందుకోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా జరిగే అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ చౌడయ్య, వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ఉమాదేవి, పంచాయతీరా జ్ ఏఈ హరినాథ్, ఏపీవో పుష్పరాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలోని డీపీఈపీ, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలు, బోధనప్రణాళికలు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. హెచ్ఎంలు రవి, చెంచులక్ష్మి, ఉపాధ్యాయులు మాలతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై డ్వాక్రా మహిళకు అవగాహన కల్పించాలి: ఎంపీడీవో

శావల్యాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై సీసీలు, వీవోఏలు డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించి వారంతా పారిశుధ్యం మెరుగుదలకు సహకరించేలా కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. థీమ్-5, క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్‌లపై స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ప్రధాన కార్యదర్శి వి. కుమారి, ఇన్‌చార్జి ఏపీఎం రామారావు, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, రిసోర్స్‌పర్సన్ అరుణభారతి, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.